క్లుప్తంగా...

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

జియాగూడ: జియాగూడ కేశవస్వామినగర్‌లో ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు జరిగే బతుకమ్మ వేడుకలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని జీహెచ్‌ఎంసీ 13వ వార్డు అధికారికి వినతిపత్రం అందించినట్లు కేశవస్వామినగర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు దర్పల్లి నర్సిములు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కేశవస్వామినగర్ మూసీ రివర్ 100 ఫీట్ల జాతీయ రహదారిలో బతుకమ్మలను వదలడానికి నీటి హౌస్, విద్యుత్ ఫోకస్ లైట్లు, పరిసరాల పరిశుభ్రత తదితరవి చేపట్టాలని ఆయన కోరారు. 23న సద్దుల బతుకమ్మతో పాటు రావణదహన కార్యక్రమం తదితర కార్యక్రమాలు కూడా కొనసాగుతాయని తెలిపారు.

పోలీసుల తనిఖీలు ముమ్మరం



అబిడ్స్: ఎన్నికల నియమావళి ప్రారంభం కావడంతో పోలీసులు ముమ్మర తనిఖీలు ప్రారంభించారు. వ్యాపారస్థులు, హవాలా వ్యాపారులు, రియలెస్టేట్ వ్యాపారులతో పాటు ఇతరులు ఎవరైనా లక్షల్లో డబ్బులను వాహనాల్లో తీసుకుపోవాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆధారాలు లేని డబ్బులను పోలీసులు కేసులు నమోదు చేసి సీజ్ చేస్తున్నారు. దీంతో డబ్బులను ఇతర దారుల్లో తరలించేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. అబిడ్స్, బేగంబజార్, షాహినాయత్‌గంజ్, మంగళ్‌హాట్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో పెద్ద ఎత్తున తనిఖీలు చేశారు.

గ్లోబల్ పీఎస్ఐకి ఆదిల్ షరీఫ్‌కు ఆహ్వానం



అబిడ్స్: స్విట్జర్లాండ్ జెన్నీవాలో జరిగే గ్లోబల్ పబ్లిక్ సర్వీసెస్ ఇంటర్నేషనల్ సమావేశానికి మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్‌కు ఆహ్వానం అందిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 12 నుంచి 18 వరకు జెనీవాలో నిర్వహించే సమావేశంలో పాల్గొనాలని ఆహ్వానం అందిందన్నారు. ఈ నెల 11న బయలుదేరి వెళ్తున్నట్లు ఆయన అన్నారు. తనకు సహకరించిన ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మాజీ ఎంపీ డాక్టర్ జి.సంజీవరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ఏడుగురికి జైలు

నాంపల్లి: రోడ్లపై న్యూసెన్స్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఏడుగురి యువకులపై హబీబ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. మనోరంజన్ కాంప్లెక్స్‌లోని రెండవ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు వీరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటుగా ఒక్కొక్కరికి రూ.550 జరిమానా విధించింది. హసన్‌నగర్‌కు చెందిన జగదీష్ కుమారుడు నాగేందర్(20), వారాసిగూడకు చెందిన షేక్ రషీద్ కుమారుడు షేక్ అర్షద్(27), రైతు బజార్‌కు చెందిన సాయిరెడ్డి కుమారుడు శివకుమార్ రెడ్డి(21), హబీబ్‌నగర్‌కు చెందిన అబ్దుల్ అజీజ్ కుమారుడు మహ్మద్ అబ్దుల్ ఫీజాన్(21), హబీబ్‌నగర్‌కు చెందిన అబ్దుల్ హఫీజ్ కుమారుడు అబ్దుల్ ఉబేద్‌ఖాన్(26), హబీబ్‌నగర్‌కు చెందిన కె.సుదర్శన్ కుమారుడు కె.రోహిత్(23), టోలిచౌకి ప్రాంతానికి చెందిన తాహెర్ బేగ్ కుమారుడు మిర్జా వసీమ్ అక్రమ్ అలీ బేగ్‌కు జైలు విధిస్తూ న్యాయస్థానం తీర్పును ఇచ్చింది. వీరిపై 70బి సీపీ యాక్టు, 186 ఐపీసీ సెక్షన్ల కింద హబీబ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థి అదృశ్యం



సయ్యద్ అర్షద్ హుస్సైనీ (ఫైల్)

గౌలిపురా: విద్యార్థి అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుల్తాన్‌షాహీ ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్దుల్ రహీమ్ ఇంట్లో బంధువైన సయ్యద్ అర్షద్ హుస్సైనీ (21) నివాసముంటూ విద్యనభ్యసిస్తున్నాడు. కాగా అర్షద్ హుస్సైనీ ఇటీవల పరీక్షల్లో ఫెయిల్ కావడంతో అబ్దుల్ రహీమ్‌తో చిన్నపాటి గొడవ జరిగి మందలించాడు. దీంతో హుస్సైనీ ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి కనిపించకుండా పోయాడు. దీంతో ఆందోళన చెందిన రహీమ్ స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌పీ గ్యాస్ నకిలీ ఉత్పత్తుల విక్రేతల అరెస్టు

గన్‌ఫౌండ్రీ: హెచ్‌పీ గ్యాస్‌కు చెందిన నకిలీ ఉత్పత్తులపై ఒరిజినల్ స్టిక్కర్లను పెట్టి ప్రజలను మోసం చేసి సొమ్ముచేసుకుంటున్న నిందితులను బేగంబజార్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సెంట్రల్‌జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేగంబజార్ ఫీల్‌ఖానాలో ధనలక్ష్మీ ఏజెన్సీ పేరుతో దేవరాజ్ పర్మర్ (28), హిమ్మత్ పర్మర్(22)లు దుకాణం నిర్వహిస్తున్నారు. కాగా యజమాని దేవరాజ్ గత కొంతకాలంగా హెచ్‌పీ గ్యాస్ ఉత్పత్తులపైన ఒరిజినల్ స్టిక్కర్లను అతికించి మోసాలకు పాల్పడుతున్నారు. ఈ విషయంపై పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఏజెన్సీపై దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి 20 కాటన్ల నకిలీ గ్యాస్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా హిమ్మత్ పరారీలో ఉన్నాడని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పాతబస్తీలో మొదలైన ఎన్నికల హడావుడి

- నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారుల నియామకం
- ఆర్‌ఓ కార్యాలయాల ఎంపిక



మాట్లాడుతున్న చార్మినార్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకన్న

చార్మినార్: శాసనసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పాతబస్తీలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధిత ఎన్నికల అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇందులో భాగంగా చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నాలుగు నియోజకవర్గాలకు చెందిన కార్యాలయాలతో పాటు రిటర్నింగ్ అధికారుల నియామకం జరిగింది. ఆయా నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులుగా (ఆర్‌ఓ) నియమితులైన వారందరూ మంగళవారం ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది, అధికారులతో పాటు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. తమకు కేటాయించిన కార్యాలయాల్లో ఏర్పాట్లను పరిశీలించి ముందస్తు సమావేశాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మంగళవారం అఖిల పక్ష రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు స్వీకరించారు. అలాగే సంబంధిత ఎన్నికల సిబ్బందికి తీసుకోవాల్సిన పనులపై ఆదేశాలు జారీ చేశారు.

రిటర్నింగ్ అధికారులు.. వారి కార్యాలయాల వివరాలు..

పాతబస్తీలోని చార్మినార్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న బాధ్యతలు చేపట్టగా.. మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో చార్మినార్ నియోజకవర్గం రిటర్నింగ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. చాంద్రాయణగుట్ట శాసనసభ నియోజకవర్గానికి చెందిన ఆర్‌ఓగా హైదరాబాద్ డివిజన్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) సూర్య ప్రకాశ్ నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన కార్యాలయాన్ని ఫలక్‌నుమా బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయాన్ని వినియోగిస్తున్నారు. యాకుత్‌పురా నియోజకవర్గానికి చెందిన ఆర్‌ఓగా హైదరాబాద్ డీఆర్‌ఓగా వెంకటచారి బాధ్యతలు చేపట్టగా.. చంపాపేట్ సైదాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయంగా వినియోగిస్తున్నారు. ఇక బహదూర్‌పురా శాసనసభ నియోజకవర్గం ఆర్‌ఓగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.దశరథ్ సింగ్ నియమితులయ్యారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే



కాంగ్రెస్ ఎన్నికల హామీ పత్రంతో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. మంగళవారం కార్వాన్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, సీనియర్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ఎన్నికల పత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు తెలంగాణ పెట్టిందే పేరని చెప్పుకునే బీఆర్ఎస్ ప్రభుత్వం నాణానికి మరోవైపు ఉన్న విషయాన్ని మాత్రం దాచిపెడుతుందన్నారు. తొమ్మిదేళ్లుగా తెలంగాణలో నిరుద్యోగం బాగా పెరిగిందని, ఉపాధి కల్పన కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు ఎక్కడ అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎవరు కూడా ఊహించని విధంగా పాలన సాగుతుందని ఇప్పటికే ఆరు హామీలను కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంటిబాబు, శ్రీరాములు, అబ్దుల్ హమీద్, వినోద్‌సింగ్, జి.కృష్ణ, హబీబ్, అతర్, ఇషాక్, నర్సింహ్మారెడ్డి తదితరులున్నారు.

గుడిమల్కాపూర్‌లో 'మేరీ మాటీ మేరా దేశ్'



కార్యక్రమంలో బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: ప్రధాని మోదీ పాలనలో భారత దేశం ప్రపంచంలోనే అగ్రదేశంగా రూపొందిందని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద 'మేరీ మాటీ మేరా దేశ్'కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో దేశం ఆర్థికంగా బలహీనంగా ఉండేదని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలతో ప్రపంచ వేదికలపై భారతదేశం కనుమరుగైందన్నారు. మోదీ సమర్థపాలనతో నేడు భారతదేశం అంటే ఒక బలమైన దేశంగా ఆర్థికంగా కాకుండా రక్షణ రంగంలో కూడా బలీయమైన శక్తి అని గుర్తింపబడుతుందని అన్నారు. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని ఆయన అన్నారు. అఖండ మెజార్టీతో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.సునీల్‌యాదవ్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ఆకుల గోవర్ధన్ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



టోలిచౌకిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకి వద్ద స్థానికులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాల్లో తాము అభివృద్ధి పనులు చేశామని అన్నారు. మజ్లిస్ పార్టీ అంటే గతంలో ప్రజల్లో చిన్నచూపు ఉండదని ప్రాంతీయ పార్టీగా ముద్ర వేసే ప్రయత్నం చేశారని అన్నారు. అయితే ప్రజల నుంచి వస్తున్న అఖండ ఆదరణతో నేడు అసలైన జాతీయ పార్టీగా అవతరించిందన్నారు. మహారాష్ట్ర నుంచి తమ పార్టీకి ఎంపీ ఉన్నారని స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో మజ్లిస్ అభ్యర్థులు ప్రజాప్రతినిధులుగా ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో అర్హులైన దళిత యువకులకు దళితబంధు పథకం వర్తింపజేశామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు బదర్‌ఉద్దీన్, హారూన్‌ఫరాన్, సయ్యద్ జబ్బార్ తదితరులున్నారు.

'సాహిత్యంతో మంచి మార్పు వస్తోంది'

గన్‌ఫౌండ్రీ: సాహిత్యంతో సమాజంలో మంచి మార్పు వస్తోందని హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో జన వికాస సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ పాండురంగారావు రచించిన తిరగబడు, ప్రమాదంలో ప్రజాస్వామ్యం, ప్రమోదంలో ప్రజానికం అనే పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం ఎప్పుడూ కూడా ప్రమాదంలో పడదన్నారు. ప్రజాస్వామ్యంలోని వ్యవస్థలను చక్కదిద్దాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. రాజకీయమే సర్వసతమని కొంతమంది మాట్లాడడం సరికాదని, రాజకీయం కేవలం ఒక రంగం మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్‌నారాయణ, జాతీయ కమిషన్ మాజీ సభ్యులు చింతా సాంబమూర్తి, ఓయూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రవీందర్, విశ్రాంత ఐఏఎస్ ఎంవీ రెడ్డి, జనవికాస్ సేవా సమితి నాయకులు తాటి శ్రీనివాస్, వి.నరోత్తమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎన్‌ఐటీఎస్‌లో టై గ్రాడ్ కిక్ ఆఫ్ 2023–24



కార్యక్రమంలో జీఎన్‌ఐటీఎస్ వైస్ చైర్‌పర్సన్ శ్రీ విద్యారెడ్డి తదితరులు

గోల్కొండ: శాస్త్రసాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు తమ ఆలోచన ధోరణి, భవిష్యత్తు ప్రణాళికలను కూడా సరి చేసుకోవాలని టై గ్రాడ్ చైర్మన్ భానుప్రకాష్ వర్ల అన్నారు. మంగళవారం షేక్‌పేట్ వద్ద గల జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన టై గ్రాడ్ కిక్ ఆఫ్ 2023–24 సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి విద్యార్థుల్లో జిగ్నాస బాగా పెరిగిందని తమకు నచ్చిన విషయంపైనే వారు పరిశోధనలు చేస్తూ ముందుకు సాగుతూ విజయం సాధిస్తున్నారన్నారు. హైదరాబాద్ టై బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ రాజ్‌సామల మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కావాల్సిన సహాయ సహకారాలు అందించడానికి ఇటువంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం జీఎన్‌ఐటీఎస్ టై గ్రాడ్ ప్లస్ మధ్య జరిగిన ఒప్పందాన్ని జీఎన్ ఐటీఎస్, టై గ్రాడ్ ప్రతినిధులు ఒకరికొక్కరు ఇచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జీఎన్‌ఐటీఎస్ వైస్ చైర్‌పర్సన్ శ్రీవిద్యారెడ్డి గుణంపల్లి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లి రమేష్‌రెడ్డి, జీఎన్‌ఐటీఎస్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యూబేషన్ డీన్ డాక్టర్ కల్యాణి, టై అసోసియేట్ డైరెక్టర్ వంశీకృష్ణ జడల తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ బీఎస్పీ కోశాధికారిగా రామ్‌చరణ్ దాస్



కోశాధికారి, కార్యదర్శులను అభినందిస్తున్న డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

చార్మినార్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా కోశాధికారి మూల రామ్ చరణ్ దాస్‌ను గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చాట్ల చిరంజీవి నియమించారు. బీఎస్పీ చార్మినార్ నియోజకవర్గం అధ్యక్షుడిగా ఉన్న మూల రామ్ చరణ్ దాస్‌ను జిల్లా కోశాధికారిగా నియమించడం ద్వారా పాతనగరంలో బీఎస్పీ బలోపేతం అవుతుందని ఆయన తెలిపారు. అదే విధంగా చాంద్రాయణగుట్ట ఉప్పుగూడకు చెందిన కె.రమేశ్‌ను గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు చిరంజీవి తెలియజేశారు. పాతనగరానికి చెందిన వీరు బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కోశాధికారిగా నియమించినందుకు మూల రామ్ చరణ్ దాస్, కార్యదర్శిగా నియమించి కె.రమేశ్ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌కు, జిల్లా అధ్యక్షుడు చాట్ల చిరంజీవికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని వారు తెలిపారు.

కూల్ డ్రింక్స్ సప్లయ్ గోదాంలో అగ్ని ప్రమాదం

సంతోష్‌నగర్: కూల్ డ్రింక్స్ సప్లయ్ గోదాంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కంచన్‌బాగ్ హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ అత్తర్ ఖాన్ అలియాస్ ఫరాజ్ బాలాపూర్ డైమండ్ హోటల్ సమీపంలో ఖాన్ కూల్ డ్రింక్స్ సప్లయ్ గోదాంను నిర్వహిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 12.10 గంటల సమయంలో కూల్ డ్రింక్స్ సప్లయ్ గోదాంలో మంటలు వ్యాపించినట్లు అత్తర్ ఖాన్‌కు సమాచారం అందింది. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న అత్తర్ ఖాన్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది, స్థానిక ప్రజల సహాయంతో మంటలను ఆర్పివేశారు. ఈ అగ్ని ప్రమాదంలో గోదాంలోని సరుకులు, స్వైపింగ్ మెషీన్, ఫ్రిజ్, కూలర్, కంప్యూటర్, బిల్లులు, షాపు ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లతో పాటు కౌంటర్‌లోని నగదు సైతం అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. దీనిపై బాధితుడు అత్తర్ ఖాన్ కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనలో దాదాపు రూ.85 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కోటేశ్వర రావు తదితరులు

నూతన కార్యవర్గం ఎన్నిక

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర వెటర్నరి కెమిస్ట్, డ్రగిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కె.సోడయ్య యాదవ్ నూతన అధ్యక్ష కార్యదర్శులకు నియామక పత్రాలను అందజేశారు. అధ్యక్షుడిగా ఎ.కిశోర్ కుమార్, కార్యదర్శిగా జి.రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా కె.రాఘవేందర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.వెంకటేశ్వర్‌రావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమ మీద నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం త్వరలో జరగబోయే తెలంగాణ ఫార్మసి కౌన్సిల్ ఎన్నికల విధి విధానాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఔషధ తనిఖీ అధికారుల సంఘం జాతీయ అధ్యక్షుడు కోటేశ్వరరావు, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ నూతన కమిటీకి అభినందనలు



ఎగ్జిబిషన్ ఉపాధ్యక్షుడు సత్తేందర్, కార్యదర్శి హన్మంతరావులకు అభినందనలు తెలిపిన బండారు దత్తాత్రేయ

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ నూతన కమిటీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. ఇటీవల ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన వనం సత్తేందర్, కార్యదర్శి హన్మంతరావుతో పాటు ఇతర పాలకవర్గానికి ఆయన శుభాకాంక్షలు చెప్పారు. మంగళవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో దసరా అలయ్ బలయ్ వేడుకలను నిర్వహించే ఏర్పాట్లను గవర్నర్ దత్తాత్రేయ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ కార్యాలయానికి విచ్చేసి నూతన కమిటీని అభినందించారు. నూతన కమిటీ ఉపాధ్యక్షుడు వనం సత్తేందర్, కార్యదర్శి హన్మంతరావు, వినయ్‌కుమార్ ముదిరాజ్, పలువురు నాయకులు దత్తాత్రేయను ఘనంగా సత్కరించారు.

జక్కుల విఘ్నాతకు బెస్ట్ టీచర్ అవార్డు-2023



విఘ్నాతను సన్మానిస్తున్న శ్యామ్‌రావు ముదిరాజ్, రాజ్‌నారాయణ్ ముదిరాజ్

చార్మినార్: ప్రపంచంలో అన్నింటి కన్నా గొప్ప వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు శ్యామ్‌రావు ముదిరాజ్ అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాతబస్తీలోని శారద విద్యాలయానికి చెందిన ఉపాధ్యాయురాలు జక్కుల విఘ్నాతకు బెస్ట్ టీచర్ అవార్డు-2023ని ఆయన డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధ్యాయులు విద్యార్థుల బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తారన్నారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా వారిని క్రమశిక్షణ గల యువకులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు.

పేదలను ఆదుకోవాలి

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు చురుకుగా పాల్గొని సమాజంలోని పేదలను ఆదుకోవాలని కుంభమేళా అగర్వాల్ బంధు, అగ్రసేన్ మహారాజ్ గోశాల వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగర్వాల్ అన్నారు. కుంభమేళా అగర్వాల్ బంధు ఆధ్వర్యంలో మంగళవారం స్మృతి దివస్ కార్యక్రమాన్ని రికాబ్‌గంజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమంలో నిరంతరం పాల్గొంటూ సమాజంలోని పేదలకు సేవలు చేసి పరమపదించిన అగర్వాల్ బంధు ప్రముఖులందరికీ తాము ఈ సందర్భంగా నివాళులర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అను అగర్వాల్, రవీంద్ర కుమార్, నార్నోలి, రాజ్ కమల్, పవన్, సునిల్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న పంకజ్ కుమార్ అగర్వాల్

వాటర్ ప్లాంట్ ప్రారంభం



నాంపల్లి: వృద్ధులు–న్యాయ సేవల్లో భాగంగా ఫలక్‌నుమాలో గల ఫాతిమా ఓల్డేజ్ హోం ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి హాజరై కేరింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి ప్రసంగించారు. వృద్ధాప్యంలో ఉన్న వారు, మానసిక రుగ్మతలకు గురైన వారు ఒంటరి వారు కాదన్నారు. వారికెల్లప్పుడు తోడుగా ఉంటూ వారి సమసయలను పరిష్కరించడంలో న్యాయ సేవా సంస్థలు ముందుంటాయని అన్నారు. వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన దాతలను ఈ సందర్భంగా అభినందించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ ఎస్.ప్రేమావతి మాట్లాడుతూ... ఏదైనా సమస్యలు ఉంటే దగ్గరలో ఉండే లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ అబ్దుల్‌వసీ, ఓల్డేజ్ హోం కార్యదర్శి వాసెఫ్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలి



సీఎంఈ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జున్

గోల్కొండ: ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచడం ఆస్పత్రి సిబ్బంది బాధ్యత అని సీఎంఈ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.మల్లికార్జున్ అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో సీఎంఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మోటారిటి తగ్గించడంతో పాటు క్వాలిటీ వైద్య సేవలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కొంత కాలంగా నగరంలో ప్రబలిన సీజనల్ వ్యాధుల కారణంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య బాగా పెరిగిందన్నారు. పెరుగుతున్న ఔట్ పేషంట్లకు అనుగుణంగా సిబ్బంది పనితనాన్ని కూడా పెంపొందించి వచ్చిన రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నార. ఔట్, ఇన్ పేషంట్స్ విభాగాల వద్ద పరిశుభ్రతను పాటించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహరుల్లా, రాష్ట్ర క్వాలిటీ కన్సల్టెంట్ ఆఫీసర్ ఆశోక్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పీఓ మల్లికార్జున్, ప్రశాంత్, ఆర్.రాము, ఏఏఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

నాటక రంగాన్ని ప్రోత్సహిద్దాం



గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో క్రియేటీవ్ థియేటర్ ఆధ్వర్యంలో క్రాంతి అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాటి సమాజంలోని స్థితిగతులను నాటకరూపంలో చక్కగా వివరించారని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, రచయిత్రి మెర్సిమార్గరేట్ మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రంగస్థల నటుడు వీర మనోహర్, సురభి వెంకటేశ్వర్లు, సంస్థ వ్యవస్థాపకులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలి



రిటర్నింగ్ అధికారి విక్టర్

అబిడ్స్: రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల నిబంధనలు పాటించాలని గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందేనని ఆయన అన్నారు. మంగళవారం అబిడ్స్‌లోని గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికలకు నలుగురు ఏ.ఆర్.ఓలను నియమించామన్నారు. 19 సెక్టార్ ఆఫీసర్లు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి సెక్టార్‌లో ఫ్లైంగ్ స్కాడ్స్, వీవీటీ, ఎఫ్ఎస్‌టీ, ఎఫ్ఎఫ్‌టీ సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. ప్రతి సెక్టార్‌లో ధనం, మద్యం, డ్రగ్స్ ఎవరైనా ప్రజలను ప్రలోభపెడితే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్క రాజకీయ పార్టీ నిబంధనలను పాటించాలని, లేనిచో ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు చేపడుతామన్నారు. గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2.66.909 లక్షల మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో 1,39,526 మంది పురుషులని, 1.27.353 మంది మహిళా ఓటర్లు ఉన్నారని వివరించారు. నియోజకవర్గంలో 235 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని రిటర్నింగ్ అధికారి విక్టర్ తెలిపారు. ప్రతిరోజూ సెక్టార్‌ల వారీగా ప్రాంతాల్లో పోలీసులతో కలిసి సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపడుతారని వివరించారు.

నవంబర్ 3 నుంచి నామినేషన్ల స్వీకరణ..

నవంబర్ 3 నుంచి అబిడ్స్ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని గోషామహల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామని రిటర్నింగ్ అధికారి విక్టర్ వివరించారు. నవంబర్ 10వ తేదీ వరకు నామినేషన్ల ముగింపు ఉంటుందన్నారు. నామినేషన్ పత్రాలు అవసరం ఉన్నవారు రిటర్నింగ్ కార్యాలయంలో తీసుకోవాలని సూచించారు. నవంబర్ 13న నామినేషన్ల స్క్రూటినీ ఉంటుందని, నవంబర్ 15వ తేదీ వరకు నామినేషన్ల విత్‌డ్రాలు ఉంటుందని ఆయన వివరించారు.